# శ్రీ, చరణాలు

శ్రీ రాజశేఖరం గారికి,

"శ్రీవారి పాదపద్మ ములకు నమస్కారాలతో" అని ప్రారంభించవలసిన జాబును అలా మొదలు పెట్టలేక పోతున్నాను. అందుకు కారణం- "ఆ మీ పాదాలు సాక్షాత్తు ఆ శ్రీమహాలక్ష్మి తన ప్రియాంకం మీద మోపుకొన్న పాదాల్లానో......ఆ వాగ్గేయకారులు శ్రీ అన్నమాచార్యులవారు దర్శించిన 'ఆ బ్రహ్మ కడిగిన పాదం 'లానో' అన్పించక పోవటం వల్లనే..... సుమండీ! మరో విషయం....

"మీపట్ల ఈ జాబులో గౌరవవచనం, నా సంస్కారం వలననే కాని, అందుకు మీరు అర్హులై కాదు అని గమనించండి.

మన దాంపత్య జీవితం ప్రారంభమయిన తొలినాళ్లలోనే కాదు, ఆ తర్వాత కూడ మీ పాద ద్వయాన్ని పవిత్రంగానే భావించాను. మీకు వ్రాసిన ఎన్నో జాబులను, వాటికి నమస్కరిస్తూనే ప్రారంభించానని మీకు గుర్తుండి వుండాలి. గుర్తుండక పోయినా ఆశ్చర్య పోను. ఎందుకంటే ఆశ్చర్య పోవాల్సినవే కాదు, సిగ్గు పడవలసిన ఎన్నో సంఘటనలను మీరు ఈ మధ్య సృష్టించారు కదా!

అసలీ జాబు వ్రాయవలసిన ఆవశ్యకత వుందా అనే విచికిత్సలో గడిపాను గత పది పదిహేను రోజులుగా; అంటే మా అన్నయ్య మీ దగ్గరకు వచ్చి మాట్లాడివచ్చారు చూడండి, ఆనాటి నుండి. అవసరం లేదనే అనిపించింది.

అయినా వ్రాస్తున్నాను.

మనం ప్రేమించి పెళ్ళి చేసుకోకున్నా...... పూర్తిగా ఒకరికొకరు నచ్చాకే మన పెళ్ళి జరిగింది. మీ విషయం ఏమో కాని నా వరకు నేను మనోవాక్కాయకర్మలా మీదాన్నే అనుకొన్నాను. అలా అనుకొనే మీ ధర్మపత్నిగా అంకితం అయ్యాను.

మన మధ్య ఇరవయ్ సంవత్సరాల జీవితం గడిచింది. "కార్యేషుదాసి... కరణేషు మంత్రి" అనే శ్లోక తాత్పర్యాన్ని తూచా ఆచరించానని కాదు కాని, ఆ స్ఫూర్తితోనే మీ భార్యగా వ్యవహరించటానికి ప్రయత్నించానని ఆత్మసాక్షిగా చెప్పగలను.

కాని మీరు చేరిన చిన్న వుద్యోగంతో ప్రారంభమైంది మన సంసార జీవితం ఏనాడూ మిమ్మల్ని నాకది కావాలి, ఇది కావాలి అని కోరిన గుర్తు లేదు నాకు. కనీసం పూలైనా తెమ్మని కోరిన దాన్నికాదు. మీ ఆర్జన ఏపాటిదైనా, దానితోనే కాపురాన్ని దిద్ది తీర్చుకొంటూ వచ్చాను.

ఆ రోజులలో అలసటతో యింటి కొచ్చే మీకు ఆహ్లాద వాతావరణాన్ని కల్పించాలనే తాపత్రయపడ్డాను. కాని యింటిలో అవి లేవు....ఇవి లేవని గొణిగి మిమ్మల్ని ఏనాడూ విసిగించలేదని ఒప్పుకోవటానికి మీకేమైనా అభ్యంతరమా?

మీకు తల నొప్పి వస్తే తాళలేక పోయాను. మీరు జ్వరపడితే తల్లడిల్లి పోయాను. మీకు గుర్తుందో లేదో, ఒకసారి 'టైఫాయిడ్' తో 21 రోజులు మంచాన పడ్డారు మీరు. నేను మొక్కని దేవుడు లేడు.... ముడుపులు కట్టని దేవత లేదు. భావన్నారాయణ స్వామి దేవాలయ ప్రాంగణం చుట్టూ తడి గుడ్డలతో సర్వాంగ ప్రదక్షిణం చేస్తే శరీరమంతా దోక్కొని పోయింది.

'ఏమిటీ మూర్ఖత్వం' అంటూ మందలించారు కూడ మీరు. అలా దోక్కుపోయిన చోట ఏర్పడ్డ మచ్చలెంత వికృతంగా వున్నాయో అన్నారు మీరు. కాని వాటిని చూచుకొన్నపుడల్లా 'మిమ్మల్ని' రక్షించు కొన్నాననే తృప్తిని, ఆనందాన్నే పొందాను కాని బాధ పడలేదు.

మన అదృష్టం బాగుంది. డిపార్ట్‌మెంటల్ పరీక్షలు వెంట వెంటనే పాసవుతూ ఒక్కొక్క మెట్టే ఎక్కి ఆఫీసరు అయ్యారు మీరు. జీపు..... టెలిఫోను వచ్చాయి.

ఈ జన్మకు ఆ అదృష్టం వుండదా అనుకొనేదాన్ని. అలాంటిది ఆలస్యంగా నైతేనేం "అజయ్...శిరీష" రత్నాల్లాంటి బిడ్డలు కలిగారు మనకి.

నేను మొదటిసారి గర్భిణిగా ఉన్న రోజులలో, ఎందుకో, విసుగు పడేవారు మీరు. ఆ విసుక్కు కారణం ఆఫీసులోని సమస్యలని సరిపెట్టుకొనేదాన్ని. మీరెంత అర్ధరాత్రి, అపరాత్రి తిరిగి వచ్చినా నెలలు నిండి కదలలేకున్నా మీ అవసరాలను చూడటానికి ఎంత రాత్రైనా మేలుకొని వుండేదాన్ని కాని, జవానుల మీద, పని మనుషుల మీద మీ బాధ్యతలను మోపేదాన్ని కాదు.

మీరింకా పెద్ద ఆఫీసరు అయ్యారు. కారు వచ్చింది. బంగ్లాలోకి మారాము. పార్టీకి వచ్చిన బంధుమిత్రులంతా, మీ భార్య అదృష్టరేఖ - మీ పిల్లలు పుట్టిన 'వేళావిశేషం' అంటూ వుంటుంటే, "అయితే నా మెరిట్ అంటూ ఏమీ లేదా" అని చాల విచిత్రంగా కొట్టి వేశారు వారి మాటలు, మీరు.

మీరు "స్టేటస్", "స్టేటస్" అని ప్రతిక్షణం జ్ఞాపకం చేస్తూ ఉండటంతో తోటివారిలో మీరు చులకన కాకూడదనే వంటమనిషిని పెట్టటానికి అంగీకరించాను కాని నా భర్తకు, పిల్లలకు ఆప్యాయంగా యింత వండి పెట్టుకోలేకా కాదు, మనస్సంగీకరించీ కాదు.

శిరీష పుట్టిన తరువాత ఎందుకో నా ఆరోగ్యం చిన్నగా క్షీణించటం ప్రారంభించింది. కొంచెం నడచినా, నాల్గు మెట్లు ఎక్కినా, ఆయాసం....అలసట. బరువు తగ్గిపోయాను. మీరు ఇవేవీ 'గుర్తించలేదు'. అనవసరంగా మిమ్మల్ని విసిగించినదాన్ని అవుతానేమో అని నేను మీకు చెప్పలేదు మొదట్లో.

కాని....చెప్పక తప్పింది కాదు.

చెప్పాను.

ఎవరిదో శ్రీమంతుల యింటిలో వున్న పార్టీకి వెళ్ళే హడావిడిలో నా మాటలు వినిపించుకోలేదు మీరు. పైగా 'టై' కన్పించలేదని, బూట్ పాలిష్ అయి వుండలేదని కోప్పడ్డారు.

మీరు పార్టీ నుండి తిరిగి వచ్చేపాటికి ఒళ్ళు తెలియని జ్వరంతో వున్నాను.

"డాక్టరు దగ్గరకెళ్లి చూపించుకోకపోవటానికేం రోగం?" అంటూ

విసుక్కొన్నారు. నా మనస్సు చివుక్కుమంది. ఆ క్షణాన, నా వంటిపై వున్న 'ఆ మచ్చలు' నన్ను చూచి జాలిగా నవ్వినట్లనిపించింది.

చిన్న చిన్నగా నా ఆరోగ్యం శిథిలమయింది. చిక్కిశల్యమయ్యాను. మంచానికి కరుచుకుపోయిన నన్ను చూచి పిల్లలు భయపడి ఏడ్చేవారు.

"చూడటానికి ఎంత అసహ్యంగా వున్నావో" అన్నారు మీరు. అది మీరు నా పట్ల పల్కిన సానుభూతి వాక్యం.

హాస్పిటల్లో చేర్పించారు నన్ను అనేకంటే నా మంచిచెడ్డలు చూడవలసిన బాధ్యతను హాస్పిటల్లోని నర్సులకు అప్పగించారనటం న్యాయం.

సాయంత్రానికల్లా పిల్లలు హాస్పిటల్‌కు వచ్చేవారు. "డాడీ రాలేదా...బిజీగా వున్నారా?" అన్న నా ప్రశ్నకు పిల్లలు ఒకరి మొఖాలు ఒకరు చూచుకొని మిన్నకుండేవారు.

ఓనాడు 'అజయ్' చెప్పాడు - "డాడీ...మా యిద్దరిని హాస్టల్లో చేర్చుతామంటున్నారు" అని. "అంతటి దిక్కులేని పక్షులవుతున్నారా వీళ్ళు" అని భయం వేసింది.

నా జాబందుకొన్న అన్నయ్య జమ్‌షడ్‌పూర్ నుండి ఆగమేఘాల మీద వచ్చి వాలాడు. అస్థిపంజరంలా వున్న నన్ను చూస్తూనే "ఇదేమిటిరా శైలూ" అంటూ నన్ను పొదివి పట్టుకొని తల ఒళ్ళో యిముడ్చుకుని నా తల నిమురుతూ వస్తోన్న దుఃఖాన్ని ఎంతో నిబ్బరంగా ఆపుకొన్నాడు.

కాని, నాకు మాత్రం దుఃఖం ఆగలేదండి. చచ్చిపోతానని కాదు, అన్నయ్య చూపిన ఆదరణ ఆప్యాయతలు నా సర్వస్వం అనుకొన్న మీ నుండి పొందలేక పోయానేమో, అని.

'ఊరుకో శైలూ' పిల్లలు భయపడతారు. నేను వచ్చాగా, నీవిట్టే కోలుకొంటావు' అని ఊరడించాడన్నయ్య.

డాక్టర్లతో మాట్లాడేడు. వెంటనే "పెరుందురై" టి.బి. శానిటోరియంలో చేర్పించాడు. "అంత దూరపు శానిటోరియం అయితే ఎలా.... నాకు కుదరదు", అన్నారట మీరు.

మూడు నెలలు, నా కోసం, పిల్లల కోసం సెలవు పెట్టి తాను, వదిన పెరుందురైె వచ్చి వున్నారు.

అన్నయ్య, వదిన నాకు సపర్యలు చేశారు. పిల్లలను కనురెప్పల్లా కాపాడారు. నా ఆరోగ్యం కుదుట పడటానికి శానిటోరియం లోని వైద్యం, మందులు కారణం అనేకంటే, నా మనస్సును సేద తీర్చిన అన్నయ్య ధైర్యవచనాలు, ఆ పెన్నిధి పంచి యిచ్చిన మమతానురాగాలే కారణం అని నా విశ్వాసం.

మూడు నెలలకు నన్నిక వెళ్ళవచ్చు అన్నారు డాక్టర్లు.

"నీకు మరో మూడు నెలలు విశ్రాంతి అవసరంరా శైలూ" అంటూ అన్నయ్య అటు నుండి అటే "జమ్‌షడ్‌పూర్" తీసికొని వెళ్ళారు.

హాస్పిటలు నుండి "డిశ్చార్జి" అయ్యేనాటి కన్నా వస్తారు మీరు అనుకొన్నాను. రాలేదు. నా కప్పటికే అర్థమౌతూంది, మీరు నా పట్లెంత నిరాదరణంగా ప్రవర్తిస్తున్నదీ. నేను వ్రాసిన ఎన్నో జాబులలో ఒక్కదానికైనా జవాబు రాలేదు నాకు. నా విషయం వదలి వేయండి. కనీసం 'పిల్లలెలా వున్నారు' అనైనా అనలేదు మీరు.

మీ అభిప్రాయానికి భిన్నంగా దూరమైనా మంచి శానిటోరియంలో చేర్పించటానిక్కి చొరవ తీసికొన్న అన్నయ్యే ఆ ఖర్చంతా భరించాలి అన్న మీ అభిప్రాయమే చెప్పింది - మీరెంత నిర్దాక్షిణ్యమూర్తులో.

"ఇక వెళతానురా" అని అన్నయ్యతో అంటే - "నేను విజయవాడ వెళుతున్నాను. నేను వెళ్ళి వచ్చాక వెళ్ళవచ్చు-" అంటూ తాను ప్రయాణమై వెళ్ళి వారం రోజులు తరువాత తిరిగి వచ్చిన అన్నయ్య అన్నదేమిటో తెలుసా!

"రాజశేఖరాన్ని కలిశానమ్మా! వద్దు, నీవక్కడకు వద్దు...అతను పూర్తిగా మారిపోయాడు" అని.

అన్నయ్య పూర్తిగా చెప్పకపోయినా, ఆయన మొఖంలోకి చూచిన నాకు అంతా అర్థమయింది.

"ఇరవయ్ సంవత్సరాల కాలం 'తన సర్వస్వం' అర్పించుకొని తనతో కాపురం చేసిన భార్య 'రోగ పీడిత' అయినంత మాత్రాన పనికిరానిదౌతుందా!

చినిగిన పుస్తకాన్ని, విరిగిన సైకిలును కూడ పారవేయక దాచుకొంటామే!-

ప్రేమ, అనురాగం, కృతజ్ఞతలు - వీటికి అర్థాలు, విలువలు లేనే లేవా?

"వంట మనిషిగా మన యింట ప్రవేశించిన మళయాళీ పిల్ల 'వకుళ'లో కాపురం చేస్తున్నారట. ఆఫీసు బాయ్‌గా మీ వద్ద చేరిన 'త్యాగరాజన్'ను (అదే, ఆమెను ఆమె మొదటి భర్త నుండి తీసికొని వచ్చి, ఆ తర్వాత తానే ఆమె సంరక్షకుడినని చెప్పుకొనే 'త్యాగరాజన్'ను) తన్ని తరిమేశారట.

"వంట మనిషిగా ఆమె వద్దండి" అని నేనంటే- వాళ్ళ వ్యక్తిగత విషయాలు మనకెందుకు అన్నారప్పటిలో... అంటే ఆ నాటికే వాళ్ళనిలా ప్రోచి రక్షిద్దామనే తలంపుతో వున్నారన్నమాట.

నా నుండి విడాకులు పొందే తలంపుతో ఆమెను వివాహం చేసికొనటానికి సిద్ధంగా వున్నారట.

భేష్! మీరెంతటి కృతఘ్నులండి!

నాపిచ్చి భ్రమలో పడి ఇన్నాళ్లు గుర్తించలేక పోయాను!

మీకు గుర్తుండే వుంటుంది - అప్పటికి మీరింకా చిన్న ఉద్యోగులే...ఓసారి మీ సైకిలు దేనికో గుద్దేస్తే, మీ రెండు చేతి వ్రేళ్లు నొక్కుకుపోవటంతో, రెండు చేతులకు కుట్లు, కట్లు వేశారు. దగ్గర దగ్గర నెల రోజులు చంటిపిల్లవాడికి నోట్లో గోరు ముద్దలు పెట్టి తినిపించినట్లు అన్నం తినిపించాను. స్నానం చేయించాను. తల దువ్వాను. బట్టలు వేశాను. పొడరద్దాను. ఇంకా మరెన్నో.... చేశాను - ఓ తల్లిలా.

మీ ఆఫీసు వర్కంతా చేసిపెట్టాను-ఓ చెల్లిలా. ఇంట్లో కూర్చొని 'బోర్' కొడుతుంది అంటే, రిక్షా మీద పార్కుకు, సినిమాలకి తిప్పాను, ఓ స్నేహితు రాలిలా.

మీరు ద్రోహం చేసింది - ఒక భార్యకే కాదండి....ఓ తల్లికి, ఓ చెల్లికి....ఓ స్నేహితురాలికీను.

ఇదంతా నా గొప్పతనాన్ని స్వోత్కర్షించుకోవటానికి కాదు. జాలి పడి నన్ను ఆదరించమని వేడుకోవటానికి అసలే కాదు. మీ ముందే అద్దం పెట్టి, మీరెంతటి

కృతఘ్నులో చూపాలని మాత్రమే.

ఆరు నెలల క్రిందట మీరు చూచిన అస్థిపంజరంలా లేను నేను. పరిపూర్ణ ఆరోగ్యంతో '35' ఏండ్ల ప్రాయంగా కాక '25'-ఏండ్ల జవ్వనిలా ఉన్నాను. విడాకులు పుచ్చుకొన్నాక మీలా నేనూ.......'ఛ' మిమ్మల్ని నిందించటానికైనా సరే, అలాంటి మాటలనుకోలేక పోతున్నాను.

నిక్షేపంగా మీరు కోరిన విడాకులు తీసుకొండి. నా నుండి ఎలాంటి ప్రతిఘటనా వుండదు. నేను కోర్టుకు రాను. అక్కడకు వచ్చి ఓ కృతఘ్నుడి ముఖం చూడ తలుచుకోలేదు.

అమ్మ వద్దు వద్దు అని వారించినా-"అన్నయ్య నాకు బి.ఎ. వరకు చదువు చెప్పించారు. టైపు పరీక్షలకు కట్టించారు. అవి ఈనాడు ఉపకరించాయి. ఓ ప్రైవేటు కంపెనీ నాకు ఉద్యోగం యిచ్చింది. నా కాళ్ళ మీద నేను నిలబడగల్గుతాను. అజయ్‌ను, శిరీషను- ఓ సంస్కారహీనుడి పోషణలో పెంచాల్సిన ప్రమాదం తప్పినందుకు సంతోషంగా వుంది. వీళ్ళకోసం ఏ కోర్టుకు పోకండి. మీరంతటి ప్రేమమూర్తులని కాదు....నన్ను సాధించాలనైనా సరే ఆ పని చేయకండి. ఆ పిల్లల మొఖాలు చూచాక, ఏ కోర్టు మీకు వారినివ్వదు. నేనివ్వనివ్వను.

మళ్ళీ జన్మలో మీముఖం నాకు చూపకండి. ఈ జాబును నమస్కారాలతో అని ప్రారంభింపకున్నా- 'మీకో నమస్కారం' అంటూ ముగిస్తున్నాను.

- శైలజ. ●

★ *(రచన సచిత్ర మాస పత్రిక, డిసెంబర్, 1991)* ★